క్లుప్తంగా

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ధర్మవరం అర్బన్: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందిస్తున్న 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ జె.వి.రమణ, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 104 ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం నెలరోజులుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలని, వాహనాల రిపేరీలను ప్రభుత్వమే చేయించాలని, డ్రైవర్ల ఫోన్లకు అడ్వాన్స్‌గా ఆరునెలల రీచార్జ్ చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ మండల కోకన్వీనర్ అయూబ్‌ఖాన్, నాయకులు జంగమన్న తదితరులు పాల్గొన్నారు.

8న ఉచిత కంటి వైద్య శిబిరం



కరపత్రాలు విడుదల చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 8న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు జయసింహ, ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి తెలిపారు. సాంస్కృతిక మండలిలో సోమవారం రోటరీక్లబ్ సభ్యులు కంటి వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగళూరులోని శంకర్ కంటి ఆస్పత్రి వైద్యులతో కంటి పరీక్షలు చేయించి, అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించి చూపు అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని కంటిచూపు తగ్గిన నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి నాగభూషణ, ట్రెజరర్ సుదర్శన్‌గుప్తా, సభ్యులు రామకృష్ణ, బండారు చలం తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో దంచికొట్టిన వాన



ధర్మవరంలో వర్షానికి జలమయమైన రహదారి

ధర్మవరం: తుపాను ప్రభావంతో సోమవారం సాయంత్రం ధర్మవరం పట్టణంలో వర్షం దంచి కొట్టింది. ఉదయం నుంచి ఓ మోస్తారుగా చిరుజల్లులు పడ్డాయి. సాయంత్రం రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు వర్షపునీటిలో ఇక్కట్లు పడ్డారు.

జూడో పోటీల్లో ప్రతిభ



జూడో పోటీలో మెడల్స్ సాధించిన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి కేకేఆర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు జూడో పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఇటీవల ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ స్థాయి జూడో పోటీల్లో పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పాఠశాల పీడీ శివారెడ్డి తెలిపారు. 11 మంది సిల్వర్, ఒకరు గోల్డ్ మెడల్ సాధించారని పేర్కొన్నారు. సోమవారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో జూడో పోటీల్లో రాణించిన విద్యార్థులు, పీడీని పాఠశాల హెచ్ఎం స్నేహలత, ఉపాధ్యాయులు అభినందించారు.

పశుగర్భకోశ చికిత్స శిబిరం



రైతులకు సూచనలిస్తున్న పశువైద్యాధికారులు

కనగానపల్లి: జిల్లా పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మండలంలోని తూంచర్ల గ్రామంలో సోమవారం ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో గ్రామంలోని పాడి ఆవులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్య దూడల ఉత్పత్తిపై రైతులకు అవగాహన కల్పించారు.

మామిడికి తెగులు దెబ్బ

- పూత దశే కీలకం..
- తేనెమంచు.. బూడిద తెగులు దాడి
- మెలకువలు పాటిస్తేనే మేలైన దిగుబడి

నల్లమాడ: ఉద్యాన పంటల్లో మామిడిది ప్రత్యేక స్థానం. వివిధ రకాల వంగడాలు ఇక్కడ సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 12,776.1 హెక్టార్లలో మామిడి తోటలు విస్తరించాయి. ఏటా 1,14,984.47 మెట్రిక్ టన్నుల దిగుబడి లభిస్తోంది. నాణ్యమైన పంట దిగుబడులకు మార్కెట్లో మంచి ధర లభిస్తోంది. శీతాకాలంలో మామిడి చెట్లు పూత దశకు వస్తాయి. కీలకమైన పూత దశలో వాతావరణ పరిస్థితులు, ఉష్ణోగ్రతలు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. కొన్ని సమయాల్లో పూత వచ్చినప్పటికీ అది ముడుచుకుపోయే ప్రమాదం ఉంది. సీజనల్ పూత పూర్తిగా రాకపోవడం కారణంగా నష్టం వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. ఈ సమయంలో రైతులు తగిన మెలకువలు పాటిస్తే అధిక లాభాలు పొందే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా పుట్టపర్తి ఉద్యాన శాఖ అధికారి నవీన్‌కుమార్ మామిడికి ఆశించే పురుగు, వైరస్, వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు తెలియజేశారు.

సాగునీటి యాజమాన్యం

మామిడి పూత సమయంలో తోటలకు నీటి తడులు చాలా అవసరం. పూత, మొగ్గ బయట పడే సమయంలో మామిడి తోటలకు తప్పని సరిగా నీరు అందించాల్సి వుంటుంది. నీటిని అందించే విషయంలో కూడా జాగ్రత్తలు పాటించాలి. పది పదిహేను ఏళ్లలోపు తోటలకు ఒకసారి, బాగా తేలిక పాటి నేలలైతే వారం తర్వాత ఒకసారి తడులు అందివ్వాలి. లేదంటే డ్రిప్పుల ద్వారా వారం రోజుల పాటు నీరు అందిస్తే మంచి ప్రయోజనం చేకూరుతుంది.



చౌటకుంటపల్లి వద్ద సాగుచేసిన మామిడి తోట

మామిడి పిందె దశలో..

ఆలస్యంగా కోతకు వచ్చే రకాల చెట్లపై హార్మోన్లను పిచికారీ చేస్తే పూత, పిందె రాలడం బాగా తగ్గుతుంది. తెల్లపూత జొన్న గింజ పరిమాణంలో పిందెలు ఉన్నప్పుడు 200 లీటర్ల నీటిలో 4 గ్రాముల నాఫ్తలీన్ అసిటిక్ ఆమ్లం, 400 గ్రాముల బోరాన్ కలిపి పూతపై పడేలా పిచికారీ చేసుకోవాలి. దీంతో పిందె కట్టే సమయంలో పిందె రాలడాన్ని నివారించవచ్చు. కాయ దశ వరకు దీని ప్రభావం ఉంటుంది. పిందె పరిమాణం పెరుగుతున్న సమయంలో మామిడి చెట్ల మొదళ్లలో తడి ఆరకుండా చూసుకోవాలి.

తేనెమంచు పురుగు

చలికాలంలో ఎక్కువగా మామిడికి సోకే తెగులు తేనెమంచు పురుగు. పూత రాగానే తేనెమంచు పురుగు కాండం వద్ద రసం పీలుస్తుంది. దీంతో పోషకాలు అందక పూత రాలిపోతుంది. తోటలోని మొక్కలను బాగా గమనిస్తే పూత వచ్చిన కాడ కింద ఆకులు జిగటగా ఉంటూ ఉదయం పూట మెరుస్తూ ఉంటుంది. దీని నివారణకు కాని ఫ్రైడార్ 0.3 ఎంఎల్/ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

బూడిద తెగులు

పూత కాడల మీద బూడిద మాదిరిగా కనిపిస్తుంది. బూడిద తెగులు గాలి ద్వారా చాలా వేగంగా ఓ మొక్క నుంచి మరో మొక్కకు వ్యాపిస్తుంది. దీని వల్ల చాలా వరకు పూత నిలవదు. చాలా నష్టం చేకూరుతుంది. తెగులును గుర్తించిన వెంటనే మందులు పిచికారీ చేసి నివారణ చర్యలు తీసుకోవాలి. బూడిద తెగులు నివారణకు సల్ఫర్ 2 గ్రాములు/లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా ఎక్సాకొనెజోల్ 2 ఎంఎల్ / లీటరు నీటికి కలపి పిచికారీ చేస్తే ఈ తెగులును నివారించవచ్చు.

సకాలంలో పిచికారీ చేసుకోవాలి

మామిడి చెట్లకు సకాలంలో మందులు పిచికారీ చేయాలి. పదిహేను ఏళ్లు పైబడిన చెట్లకు పిందె పరిమాణంలో ఉన్న సమయంలో 500 గ్రాముల యూరియా, కిలో పొటాషియం వేయాలి. అలా వేయడం వల్ల పిందె అభివృద్ధి చెంది వాతావరణ మార్పులను తట్టుకుంటుంది. పిందె పరిమాణం పెరిగిన అనంతరం లీటరు నీటికి 100 గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపి 20 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

అమడగూరు: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ వెంకటనారాయణ తెలిపారు. సోమవారం ఆయన మహమ్మదాబాద్‌లో 'పల్లెనిద్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఎస్ఐ మాట్లాడుతూ బాల్య వివాహం చేస్తే ఇరువురి తల్లిదండ్రులు జైలుశిక్ష అనుభవించాల్సి వస్తుందన్నారు. రాత్రివేళ అనుమానిత వ్యక్తులు సంచరిస్తూ కనపడితే వెంటనే పోలీసులకు సమాచారమందించాలన్నారు. మహిళలను వేధింపులకు గురిచేసినా, మోసాలకు పాల్పడినా నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నంబర్ ప్లేటు లేని వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన



హెచ్ఐవీపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ఎస్ఆర్‌డీడీ కళాశాల, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఎస్ఐ ఇషాక్‌బాషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి, ఆర్డీటీ ఏటీఎల్ కృష్ణ, ఎస్టీఎల్ కావేరి, కౌన్సిలర్ పర్వీన్, సీఓలు జయప్రకాష్, రమణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అంపయ్య సేవలు మరువలేనివి



డిప్యూటీ తహసీల్దార్ అంపయ్యను సన్మానిస్తున్న ఆర్డీఓ మహేష్, రెవెన్యూ సిబ్బంది

ధర్మవరం అర్బన్: డిప్యూటీ తహసీల్దార్ అంపయ్య సేవలు మరువలేనివని ఆర్డీఓ మహేష్ కొనియాడారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ అంపయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మానసభ నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం చేసే ప్రతి ఒక్కరికీ రిటైర్మెంట్ సహజమని తెలిపారు. ప్రతి ఉద్యోగీ అంకితభావంతో పనిచేసి మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో డీఏఓ ఖతిజున్‌కుబ్రా, తహసీల్దార్లు, డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



బాలకృష్ణను సన్మానిస్తున్న ఎస్ఐ సోమశేఖర్, సిబ్బంది

కోర్టు కానిస్టేబుల్‌కు సన్మానం

బత్తలపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి రామగిరి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయిన కోర్టు కానిస్టేబుల్ బాలకృష్ణకు సోమవారం స్టేషన్‌లో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఎస్ఐ సోమశేఖర్ మాట్లాడుతూ బదిలీలు సర్వసాధారణమని, అయితే మన విధుల పట్ల అంకితభావంతో పని చేయాలని సూచించారు. మనం చేసే మంచి పనులే ప్రజల్లో గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం సిబ్బంది బాలకృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు సోమశేఖర్‌మూర్తి, తిరుపాలు, సిబ్బంది ఓబులేసు, జనార్దన్, మురళి, ఆంజనేయులు, రామాంజనేయులు, హోంగార్డులు పాల్గొన్నారు.

ట్రైనింగ్ సెంటర్ కడపలోనే ఉంచాలి

అమడగూరు: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఎంఎస్ఎంఈ ట్రైనింగ్ సెంటర్‌ను కడపలోనే ఉంచాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ రామనాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ట్రైనింగ్ సెంటర్ కడపలో ఉండటం ద్వారా అందరికీ అందుబాటులో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు రామచంద్ర, జిల్లా కార్యవర్గసభ్యులు మున్నా, శివమ్మ, మండల కార్యదర్శి శ్రీనివాసులు, నరసింహ, సత్యప్ప, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



కదిరిలో మాట్లాడుతున్న సీఐ నారాయణరెడ్డి

కదిరి అర్బన్/ తనకల్లు/ ఎన్పీకుంట: చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కలిగి ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. సోమవారం కదిరిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పట్టణ సీఐ నారాయణరెడ్డి సైబర్ నేరాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. పోక్సో యాక్ట్, సైబర్‌క్రైం, డ్రగ్స్, ట్రాఫికింగ్, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ తదితర అంశాల గురించి వివరించారు. ఈవ్‌టీజింగ్, డ్రగ్స్ గురించి సమాచారం తెలిస్తే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటాచలంతో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు. తనకల్లు కేజీబీవీలో భారత చట్టాలపై విద్యార్థినులకు ఎస్ఐ గోపీ అవగాహన కల్పించారు. బాలికలు ధైర్యంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాల నిషేధ చట్టం, పోక్సో, ఉచిత నిర్బంధ విద్యాహక్కు తదితర చట్టాల గురించి తెలియజేశారు. సెల్‌ఫోన్ అవసరం అయితేనే వాడాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ అబీదా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్పీకుంట కేజీబీవీ విద్యార్థినులకు కదిరి రూరల్ సీఐ పి.నాగేంద్ర ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మాదక ద్రావ్యాల వాడకం వలన కలిగే అనర్థాలు, బాల్యవివాహాల నిర్మూలనపై సోమవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు, పోక్సో చట్టం గురించి ఎస్ఐ వలిబాషా వివరించారు. కార్యక్రమంలో జమేదార్లు నరసింహమూర్తి, ఆజాద్, మహిళా పోలీస్ లలితకళ, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించండి

పుట్టపర్తి అర్బన్: విధులకు ఆటంకం కలిగిస్తున్న వెలుగు అధికారులపై చర్యలు తీసుకుని, వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ డిమాండు చేశారు. సోమవారం పుట్టపర్తి, కొత్తచెరువు వెలుగు అధికారులకు వీఓఏల ద్వారా వ్యక్తిగత అర్జీలను అందజేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 నుంచి 18 ఏళ్లుగా పనిచేస్తున్న వీఓఏలను తాజాగా విధులు నిర్వర్తించకుండా ఇబ్బందులు పెడుతుండటంతో వారంతా కోర్టును ఆశ్రయించారన్నారు. సమస్యను సావధానంగా విన్న కోర్టు వీఓఏలను విధుల్లో కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆ ఉత్తర్వులను అధికారులకు అందజేసినా విధులు కేటాయించకుండా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. పలువురు సీసీలు గ్రామైక్య సంఘాల్లో తీర్మానాలు చేయించి అధికారులకు పరోక్షంగా సహకరిస్తున్నారన్నారు. కోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తే న్యాయ పోరాటానికి దిగుతామన్నారు.



అధికారులతో చర్చిస్తున్న వీఓఏలు, సీఐటీయూ నాయకులు

హైందవ శంఖారావం జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ధర్మవరం రూరల్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల ఐదో తేదీన విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని జిల్లా సత్సంగ్ ప్రముఖ వేద వ్యాస్ పిలుపునిచ్చారు. సోమవారం పోతుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో పాండే కృష్ణ, రాజశేఖర్, గుంజర నాగరాజు, ఈశ్వరయ్య, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మశూచితో జాగ్రత్త!



బత్తలపల్లిలో మేత కోసం వదిలిన గొర్రెలు

బత్తలపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మేకలు, గొర్రెలకు మశూచి వచ్చే అవకాశం ఉందని బత్తలపల్లి పశువైద్యాధికారి తెలిపారు. నియోజకవర్గంలోని ధర్మవరం మండలంలో 1.30 లక్షలు, బత్తలపల్లి మండలంలో 1.15 లక్షలు, తాడిమర్రి మండలంలో 1.20 లక్షలు, ముదిగుబ్బ మండలంలో 1.80 లక్షల మేకలు, గొర్రెలు ఉన్నాయన్నారు. నవంబర్ నుంచి ఏప్రిల్ వరకు గొర్రెలు, మేకలకు మశూచి వ్యాధి (ఫాక్స్ వైరస్) సోకే అవకాశం ఉందన్నారు. గాలి ద్వారా వ్యాపించే ఈ వైరస్ కారణంగా గొర్రెలు ఆహారం తీసుకోకపోవడంతో పాటు శ్వాస ఆడక ప్రాణాలు కోల్పోతాయని తెలిపారు.

నివారణ చర్యలు ఇలా..

'ప్రతి సంవత్సరం నవంబర్ నుంచే గొర్రెలకు మశూచి వ్యాధి నివారణకు టీకాలు వేయించాలి. కొత్త జీవాలను మందలో చేర్చే ముందు వాటిని కొద్ది రోజులు మందకు దూరంగా ఉంచాలి. వాటి ఆరోగ్యాన్ని పరీక్షించాలి. అన్నీ ఆరోగ్యంగా ఉంటేనే మందలో కలపాలి. వ్యాధి సోకిన మందల చెంతకు వ్యాధి సోకని వాటిని వెళ్లనీకూడదు. వ్యాధి లక్షణాలు కనబడితే వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించాలి. వ్యాధి సోకిన గొర్రెలను వెంటనే మంద నుంచి వేరు చేయాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం ఇవ్వాలి.

హరిహర గణేశ్ దేవాలయంలో ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న భవానీ శంకర్ స్వామి

ముదిగుబ్బ: మండల కేంద్రం ముదిగుబ్బలోని హరిహర గణేశ దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పూజారి రఘునాథశాస్త్రి ఆధ్వర్యంలో భవాని శంకర్‌స్వామికి అహోర పాశుపత భస్మసహిత రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మురుగును తొలగించండి



రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త, మురుగు నీరు

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని పెడబల్లి రోడ్డులో మురుగునీరు నిలిచి కంపు కొడుతోంది. మురుగు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. వర్షపు నీటితో పాటు ఇళ్లలోని మురికినీరు రోడ్డుపైకి వస్తోంది. దోమలు వృద్ధి చెంది అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సిమెంటు మూతలు ఛిద్రం



బ్రిడ్జిపై విరిగిన సిమెంట్ మూత



బ్రిడ్జి ఎక్కే సమయంలో పడిన రంధ్రం



పెద్ద గోతిలా ఏర్పడిన దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పోతుకుంట రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఫుట్‌పాత్‌లపై కేబుల్ వైర్ల కోసం ఏర్పాటు చేసిన రంధ్రాలపై వేసిన సిమెంటు మూతలు ఛిద్రమయ్యాయి. ఫుట్‌పాత్‌పై నడిచేవారు గమనించకుండా అడుగు వేస్తే కిందపడి ప్రమాదానికి గురవుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి దెబ్బతిన్న మూతలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని పాదచారులు కోరుతున్నారు.

ఆకతాయిల వికృత చేష్టలు

పోతుకుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి ఫుట్‌పాత్‌పై స్థానికులు ఉదయం, రాత్రి వేళల్లో వాకింగ్ చేస్తుంటారు. రాత్రి పూట మహిళలు వాకింగ్ చేస్తున్న సమయంలో కొందరు ఆకతాయిలు వికృత చేష్టలు చేస్తున్నారు. బైకులను బ్రిడ్జిపై అడ్డంగా పెట్టి ఏడిపిస్తున్నారు. పోలీసులు చర్యలు చేపట్టాలని మహిళలు కోరుతున్నారు.

ధర్మవరానికి ఆ పేరెలా వచ్చిందంటే..?



ధర్మవరం పట్టణం ఏరియల్ వ్యూ



ధర్మవరం అర్బన్: పట్టు చీరల తయారీలో ధర్మవరం ప్రసిద్ధిగాంచింది. ఇక్కడి చేనేత కార్మికులు నేసే చీరలు ఎంతో నాణ్యమైనవిగా ఉంటూ మగువల మనసులు ఇట్టే దోచుకుంటాయి. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ ధర్మవరం ప్రాంతానికి పేరు ఎలా వచ్చిందని పెద్దలను అడిగితే రెండు రకాల కథలు వినిపిస్తారు. పాండవులు వనవాసం చేస్తున్న రోజుల్లో ధర్మరాజు ద్రౌపదిని తీసుకుని ధర్మవరం మీదుగా వెళుతున్నాడు. పాండవులంతా నార బట్టలు ధరించి ఉన్నారు. అటుగా వెళుతున్న ఓ చేనేత కార్మికుడు పాండవులను చూసి మీకు చేనేత మగ్గంలో తయారు చేసిన పట్టుచీర ఇస్తానని చెప్పి ద్రౌపదికి అందించాడు. అప్పుడు ధర్మరాజు ఆ చేనేత కార్మికుడిని ఆశీర్వదించి.. మేము వనవాసం చేస్తున్నా మాకు సాయం చేశావు. నీకు ఏమి వరం కావాలో కోరుకో నాయనా అంటూ ఆ చేనేత కార్మికుడికి ధర్మరాజు చెప్పాడట. అప్పటి నుంచి ధర్మరాజు పేరులో మొదటి రెండు అక్షరాలు, వరంలోని అక్షరాలను కలిపి 'ధర్మవరం'గా పేరు వచ్చిందని చెబుతారు. పాండవులు వనవాసం వచ్చిన సమయంలో ఇక్కడ కేవలం 50 మంది వరకు మాత్రమే జీవిస్తుండేవారని తెలుస్తోంది.

ఇక రెండవ కథ ఏమిటంటే..

శ్రీకృష్ణదేవరాయలు కాలంలో క్రియాశక్తి వడయార్ సామంతరాజుగా ఉండేవారు. అప్పట్లో వర్షాలు బాగా వస్తున్నా నీరు నిల్వ ఉండేందుకు బావులు పెద్దగా లేకపోవడంతో ఆయన ధర్మవరం చెరువును తవ్వించారు. చెరువుకు ఏడు మరువలు పెట్టారు. ఒకసారి భారీ వర్షం కారణంగా ఏడు మరువలు పొంగి పొర్లుతున్నాయి. మరువలు తెగిపోతే చాలా గ్రామాల్లోని ప్రజలు నీట మునిగిపోతారని తెలుసుకున్న ధర్మాంబ అనే మహిళ మరువ వద్ద కట్ట తెగిపోకుండా పడుకుని ప్రాణత్యాగం చేసింది. అప్పుడు గంగమ్మ శాంతించి మరువలు తెగిపోలేదని పురాణాలు చెబుతున్నాయి. ప్రాణత్యాగం చేసిన ధర్మాంబ పేరును ఈ ప్రాంతానికి నామకరణం చేశారు. కాలక్రమేణా ధర్మాంబ పేరు కాస్తా ధర్మవరంగా మారిందని చరిత్రకారులు చెబుతున్నారు. అప్పట్లో 50 మంది ఉన్న ధర్మవరం.. నేడు 1.58 లక్షల జనాభాకు చేరింది.

ప్రధానోపాధ్యాయుడిపై సస్పెన్షన్ ఎత్తేయండి

ఎన్పీకుంట: మడకశిర మండలం ఆమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జబేజ్‌పై సస్పెన్షన్ ఎత్తి వేయాలని పీఈటీ ప్రసూన, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ 8వ తరగతి విద్యార్థి చేతన్‌ను పాఠశాల విరామ సమయంలో మేనమామ తీసుకువెళ్లి హత్య చేయడం దారుణమని, ఈ విషయంలో ఎటువంటి సంబంధమూ లేని ప్రధానోపాధ్యాయుడిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేయడం ఎంతమాత్రమూ సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. ఒక వైపు బోధనేతర పనులతో తీవ్రమైన పని ఒత్తిడితో సతమతమవుతుంటే.. ఇలాంటి ఘటనలకూ ఉపాధ్యాయులను బాధ్యులు చేయడం మంచిది కాదన్నారు. ఉన్నతాధికారులు మానవతా దృక్పథంతో పరిశీలించి ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్‌పై పునరాలోచన చేయాలని సూచించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

తలుపుల : సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని ఎంపీడీఓ రామానాయక్ కాంట్రాక్టర్లకు సూచించారు. మండలంలోని కాయలపల్లి, పెద్దన్నవారిపల్లిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఎంపీడీఓ పర్యవేక్షించారు. కాయలపల్లిలో క్యాటిల్ షెడ్ నిర్మాణ పనులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు.